ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 181 | శనివారం 07, మార్చి 2026 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# మిత్రధర్మం పాటించి తీరుతా

**ఎవరికి నచ్చినా నచ్చకపోయినా అభ్యంతరం లేదు**

**మహాభారతంలో కర్ణుడి పాత్ర నాకెంతో ఇష్టం**

**మాదిగ సోదరుల కోసం పాటుపడతా**
**ఎస్సీ వర్గీకరణ కోసం**
**తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం**
**విద్యకోసం భారీగా నిధులు కేటాయిస్తున్నాం**
**దళితులకు పంచేందుకు భూములు లేవు**
**కానీ వారికి గొప్పవిద్యను అందిస్తాం**
**గ్రామాల్లో విద్యాలయాలను అభివృద్ధి చేస్తున్నాం**
**మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మిత్రధర్మానికి కట్టుబడి చివరి వరకు నిలబడటం తన స్వభావమని, మహాభారతంలో కర్ణుడు తన మిత్రుడి కోసం చివరి ఊపిరి వరకు నిలబడ్డట్టే తాను కూడా మాదిగల న్యాయమైన హక్కుల కోసం వారి వెంట నిలబడ్డానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకళా

..మిగతా 2లో



## అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**సాంకేతిక లోపాలు సరిదిద్ది,**
**బాధ్యతను నిర్వర్తించాలి..**
**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు..**
**సాగు పద్ధతుల్లో మార్పు..**
**రైతుల్లో చైతన్యం**
**పార్టీలకు అతీతంగా ప్రజా సేవ..**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ

..మిగతా 2లో

## ప్రజల దృష్టి మరల్చేందుకే యాక్షన్ ప్లాన్

**99 రోజుల ప్రణాళికపై మాజీ మంత్రి హరీశ్ రావు**
**వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకేనని విమర్శ**
**ప్రజలు జరిగే లాభమేమీ లేదని వ్యాఖ్యలు**
**గతంతో తీసుకున్న దరఖాస్తు సంగతేంటన్న హరీశ్**
**ప్రగతి ప్రణాళిక ప్రచారం కోసమేనని ఎద్దేవా**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం నిజమైన అభివృద్ధి పనులు చేయకుండా, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ కొత్త కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఆయన ఆరోపించారు. యాక్షన్ ప్లాన్ అనే పేరుతో ప్రకటించిన ఈ ప్రణాళిక అసలు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కాదని, పాలనలో ఉన్న లోపాల నుంచి తప్పించుకోవడానికి రూపొందించిన

..మిగతా 2లో



## ఎగుమతుల్లో ప్రపంచంతో పోటీ పడాలి



**వ్యవసాయ రంగం వృద్ధి చెందాలి**
**ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు**
**రైతులు, నిపుణులకు కీలక సూచనలు**
**బడ్జెట్ అనంతరం మూడో వెబినార్**
**సాగు, గ్రామీణ పరివర్తనంపై మోడీ ప్రసంగం**
**కీలక తీసుకుంటున్న నిర్ణయాలపై వివరణ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

దేశ వ్యవసాయ రంగాన్ని ప్రపంచ మార్కెట్లలో పోటీపడేలా అభివృద్ధి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. రైతులు, వ్యవసాయ నిపుణులు, పారిశ్రామికవేత్తలు కలిసి పనిచేస్తేనే భారత వ్యవసాయం ఎగుమతుల ఆధారంగా ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన మూడో వెబినార్‌లో "వ్యవసాయం, గ్రామీణ పరివర్తన" అనే అంశంపై మాట్లాడిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.భారతదేశానికి ఉన్న విభిన్న

..మిగతా 2లో



## కుప్పకూలిన యుద్ధ విమానం

**ఇద్దరు పైలట్లు దుర్మరణం**
**అస్సాంలో దుర్ఘటన**
**సుఖోయ్ సాధారణ శిక్షణలో ప్రమాదం**
**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం**
**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం**
**భారతవైమానిక దళం హామీ**

**జోర్హాట్, (ప్రజాస్వరం):**

అసోం రాష్ట్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్30 ఎంకేఐ యుద్ధవిమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని భారత వైమానిక దళం అధికారికంగా వెల్లడించింది. ప్రమాదంలో స్క్వాడ్రన్ లీడర్ అనూజ్ మరియు ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ మరణించినట్లు తెలిపింది. ఈ విషాద సమయంలో వారి కుటుంబాలకు పూర్తి సహాయం అందిస్తామని కూడా వైమానిక దళం ప్రకటించింది.ఈ ప్రమాదం అసోంలోని కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో జరిగింది. జోర్హాట్‌లో ఉన్న వైమానిక

..మిగతా 3లో

## 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

**కర్ణాటక ప్రభుత్వ సంచలన నిర్ణయం**
**అసెంబ్లీలో ప్రకటించిన సీఎం సిద్ధ రామయ్య**
**సోషల్ మీడియా ప్రతికూల ప్రభావంపై చర్చ**
**చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన**
**విద్యా నిపుణుల సూచనలతోనే బ్యాన్ విధింపు**

**బెంగుళూర్, (ప్రజాస్వరం):**


పిల్లల భవిష్యత్తు, చదువుపై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో కర్ణాటక ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 16 సంవత్సరాల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారికంగా ప్రకటించారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.సోషల్ మీడియా వల్ల చిన్నపిల్లలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా చదువుపై దృష్టి తగ్గిపోవడం, ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లలో గడపడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని నియంత్రించడానికి

..మిగతా 3లో




## తెలంగాణలో పెరిగిన ఎండ తీవ్రత

**వాతావరణ శాఖ హెచ్చరికలు**
**పలు జిల్లాల్లో 40 డిగ్రీలకు చేరువ**
**ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**
**27 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**
**ప్రజలకు అధికారుల కీలక సూచనలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో వేసవి ప్రభావం ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా మార్చి నెల చివరి వారాల్లో పెరిగే ఎండలు ఈసారి మొదటి వారంలోనే ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. రాష్ట్రంలోని

..మిగతా 2లో

## సివిల్స్ ఫలితాలు విడుదల

**టాపర్‌గా నిలిచిన అనూజ్ అగ్నిహోత్రి**
**రెండో స్థానం సంపాదించిన రాజేశ్వరి సువే**
**టాప్ 100లో తెలుగు అభ్యర్థి సృజన**
**యూపీఎస్సీ ప్రకటించిన ఖాళీలు 1087**
**మొత్తం 958 మంది ఎంపికైనట్లు వెల్లడి**
**జనరల్ కేటగిరీలో 317 మంది ఎంపిక**




**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల కోసం

..మిగతా 3లో

## సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

**అంబర్‌పేట ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుపై అలస్యంపై ఆగ్రహం**
**సమస్యల త్వరగా పరిష్కరించేలా చర్యలకు డిమాండ్**
**తెలంగాణ అభివృద్ధి రహదారులే కీలకమన్న కేంద్రమంత్రి**
**జాతీయ రహదారుల నిర్మాణాలపై కేంద్రం దృష్టి**
**నితిన్ గడ్కరీకి సమస్యను వివరించినట్లు వెల్లడి**

03



www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM

# ఎగుమతుల్లో ప్రపంచంతో పోటీ పడాలి

**మొదటిపేజీ తరువాయి**



వాతావరణ పరిస్థితులు వ్యవసాయానికి పెద్ద అవకాశమని ప్రధాని అన్నారు. ప్రతి ప్రాంతానికి తగిన పంటలను రైతులు ఎంచుకుని సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను పెంచడం, వాటికి సరైన ప్రమాణాలు తీసుకురావడం, అలాగే బ్రాండింగ్ చేయడం ద్వారా ప్రపంచ మార్కెట్లలో మంచి గుర్తింపు పొందవచ్చని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం, సహజ వ్యవసాయం వంటి పద్ధతులను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యంపై ప్రజలు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని, అందువల్ల రసాయన రహిత ఆహార పదార్థాలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. ఈ అవకాశాన్ని భారత రైతులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆహార పదార్థాలు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి స్థానం సంపాదించే అవకాశం ఉందని చెప్పారు.

వ్యవసాయ రంగం దేశాభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రధాని మోదీ అన్నారు. ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా దాదాపు పది కోట్ల మంది రైతులకు నాలుగు లక్షల కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయం అందిందని చెప్పారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)లో చేసిన మార్పుల వల్ల రైతులకు పంట ఖర్చుపై ఒకటిన్నర రెట్లు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. రైతులకు బ్యాంకు రుణాలు అందుబాటులోకి రావడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రధాని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి సంస్థాగత రుణాల కవరేజ్ సుమారు 75 శాతానికి పెరిగిందన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా బీమా చెల్లింపులు జరిగాయని చెప్పారు. ఈ పథకాల వల్ల రైతులు ఎదుర్కొనే నష్టాలు కొంతవరకు తగ్గాయని, వారికి ఆర్థిక భద్రత కలిగిందని పేర్కొన్నారు.

ఇటీవల ప్రవేశపెట్టిన 202627 కేంద్ర బడ్జెట్‌లో కొన్ని అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ప్రధాని తెలిపారు. ముఖ్యంగా జీడిపప్పు, కోకో, శ్రీగంధం వంటి పంటలను ప్రోత్సహించే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే వంట నూనెల ఉత్పత్తి పెంచడం కోసం ఒక జాతీయ మిషన్, పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు మరో జాతీయ మిషన్ చేపట్టామని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కూడా ప్రత్యేక జాతీయ మిషన్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో అధిక విలువ కలిగిన పంటలను ఎక్కువగా పండిస్తేనే భారత వ్యవసాయం ప్రపంచస్థాయిలో పోటీకి సిద్ధమవుతుందని ప్రధాని అన్నారు. రైతులు ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. గత అనుభవాలు చూస్తే ఒకే పంటపై ఆధారపడటం రైతులకు ప్రమాదకరమని ఆయన చెప్పారు. పంటల వైవిధ్యం పెరిగితే ఆదాయం వచ్చే మార్గాలు కూడా పెరుగుతాయని వివరించారు.

వ్యవసాయం ప్రధానంగా రాష్ట్రాల పరిధిలో ఉండే అంశమని ప్రధాని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ అభివృద్ధికి పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయిస్తున్నాయని చెప్పారు. ఆ నిధులను సమర్థంగా వినియోగించి రైతులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించే ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఉపయోగించాలని రాష్ట్రాలకు సూచించారు. పాడి పరిశ్రమ గురించి కూడా ప్రధాని మోదీ కొన్ని ముఖ్యమైన విషయాలు వెల్లడించారు. పశువులను గాలికుంటు వ్యాధి నుంచి రక్షించేందుకు ఇప్పటివరకు 125 కోట్లకు పైగా టీకాలు ఇచ్చామని తెలిపారు. పశు సంవర్ధక రంగాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను విస్తరిస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా పశువుల జాతి మెరుగుపరచడం, ఉత్పత్తి పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

# తెలంగాణలో పెరిగిన ఎండ తీవ్రత

**మొదటిపేజీ తరువాయి**

అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతుండటంతో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువ కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.

గురువారం రోజున రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత ములుగు జిల్లాలో నమోదైంది. మంగపేట ప్రాంతంలో గరిష్ఠంగా 39 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అదే సమయంలో ఆదిలాబాద్ అర్బన్, ఖమ్మం అర్బన్, ధర్మపురి ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు 38.9 డిగ్రీల వరకు చేరుకున్నాయి. ఇంకా రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో 38.5 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లడం ప్రజలకు చాలా కష్టంగా మారుతోంది. రోడ్లపైకి వచ్చిన వారు కొద్ది సేపటికే ఎండ తట్టుకోలేక నీడ కోసం వెతుక్కుంటున్నారు. గత రెండు రోజులుగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే సుమారు రెండు డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం శుక్రవారం రోజున రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆరు జిల్లాల్లో తీవ్ర ఎండలు ఉండే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. అలాగే మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రజలు మధ్యాహ్నం వేళ అవసరం లేకుండా బయటకు వెళ్లకూడదని సూచించింది.

మిగిలిన 27 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువగా ఉన్నా 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా మహబూబాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో 39.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. సాధారణంగా తెలంగాణలో మార్చి నెల మూడో వారం తర్వాతే ఎండల తీవ్రత పెరుగుతుంది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. మొదటి వారంలోనే సూర్యుడు మండిపోవడంతో ప్రజలు ఇప్పటికే వేసవి ప్రభావాన్ని అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితి వచ్చే రోజుల్లో మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.గత పదేళ్ల రికార్డులను పరిశీలిస్తే మార్చి 20కు ముందే కొన్ని ప్రాంతాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా 2022 సంవత్సరం మార్చి 18న నల్గొండలో 43.5 డిగ్రీల సెల్సియస్, భద్రాచలంలో 42.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఆ రికార్డులు ఇప్పటికీ అధిక ఉష్ణోగ్రతలుగా నిలిచాయి.ఈ ఏడాది కూడా ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే తన నివేదికలో పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ వారం మొత్తం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఒకటి నుంచి ఒకటిన్నర డిగ్రీల వరకు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర భారతదేశం నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయి. ఆ గాలుల్లో తేమ శాతం తక్కువగా ఉండటంతో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. అదనంగా కొన్ని ప్రాంతాల్లో గాలి కాలుష్యం కూడా ఎక్కువగా ఉండటం వల్ల వేడి మరింత ఎక్కువగా అనిపిస్తోందని అధికారులు తెలిపారు.

# మిత్రధర్మం పాటించి తీరుతా

**మొదటిపేజీ తరువాయి**

వేదికలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు సీఎంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి మాదిగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి... మాదిగల న్యాయమైన హక్కుల సాధన కోసం తాను చాలా కాలంగా పోరాటం చేస్తున్నానని తెలిపారు. ప్రజాజీవితంలోకి వచ్చిన నాటి నుంచి మాదిగల సమస్యలు, వారి ఆవేదనలు తనకు దగ్గరగా కనిపించాయని చెప్పారు. వారి సమస్యలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఎప్పటికప్పుడు వారి వెంట నిలబడి పోరాడానని వెల్లడించారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎంతో కష్టపడి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసారని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలనే సంకల్పంతోనే తమ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ''మేము చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వెళ్లాం. అందుకే ప్రజలు మాకు ఆశీర్వదించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని ఇచ్చారు'' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

మాదిగల హక్కుల కోసం జరిగిన పోరాటాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎన్నో దశాబ్దాలుగా మాదిగ సమాజం పోరాటం చేస్తోందని చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు నిరంతరం పోరాడి తమ డిమాండ్‌ను దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చారని అన్నారు. ఈ పోరాటంలో చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని కూడా గుర్తు చేశారు. ఆ త్యాగాలను ఎప్పటికీ మరవలేమని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్టు వివరించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ఆయన గర్వంగా చెప్పారు. అయితే వర్గీకరణ ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం కాదని కూడా స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఇంకా అనేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

మాదిగల సమస్యలు పరిష్కరించే సమయంలో కొందరు అడ్డంకులు సృష్టించే అవకాశం ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు. అటువంటి పరిస్థితుల్లో సమాజం ఏకతాటిపై నిలబడి ముందుకు రావాలని సూచించారు. ''మీ సమస్యల పరిష్కారానికి ఎవరు అడ్డంకులు సృష్టించినా మీరు ధైర్యంగా ఎదుర్కోవాలి. బాధ్యతతో వ్యవహరిస్తే మీ జాతికి న్యాయం జరుగుతుంది'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి ప్రణాళికల్లో ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల ద్వారా ఈ వర్గాలకు మరింత మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ప్రభుత్వ ఖజానా బలపడితేనే సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేయగలమని సీఎం పేర్కొన్నారు. పన్నులను సక్రమంగా వసూలు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ''మీరు సమర్థంగా పని చేసి ఖజానా నింపితేనే పేదలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వానికి వచ్చిన ప్రతి రూపాయి చివరికి ప్రజల సంక్షేమానికే ఉపయోగపడుతుంది'' అని ఆయన చెప్పారు.

ప్రస్తుతం ప్రభుత్వానికి పంచడానికి భూములు లేవని సీఎం స్పష్టం చేశారు. అందుకే ప్రజలకు ఇవ్వగలిగే అతిపెద్ద ఆస్తి విద్య అని పేర్కొన్నారు. విద్య ద్వారానే పేద కుటుంబాల భవిష్యత్తు మారుతుందని అన్నారు. అందుకే విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.

ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. ప్రభుత్వ ప్రణాళికలు చివరికి ప్రజల వద్దకు చేరేలా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంటుందని చెప్పారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తే సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని తెలిపారు.

భవిష్యత్తులో మాదిగల హక్కులకు చట్టబద్ధత



కల్పించే దిశగా కూడా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. సామాజిక న్యాయం సాధించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికీ వెనుకడుగు వేయదని చెప్పారు.

గత ప్రభుత్వంపై కూడా ఈ సందర్భంగా సీఎం పరోక్ష విమర్శలు చేశారు. గతంలో కొందరు గొర్రెలు, బర్రెలు, చేప పిల్లలు వంటి పథకాల పేరుతో సంక్షేమాన్ని పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. అయితే సమాజం నిజమైన అభివృద్ధి చెందాలంటే విద్య, ఉపాధి అవకాశాలు పెరగాలని అన్నారు.

''చెప్పులు కుట్టే ఈ జాతి ప్రజలు కూడా డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలి. మీ పిల్లలు ఉన్నత స్థానాలకు చేరాలి. అదే నిజమైన సామాజిక మార్పు'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకే యాక్షన్ ప్లాన్

**మొదటిపేజీ తరువాయి**

డైవర్షన్ ప్లాన్ మాత్రమేనని అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నప్పటికీ ప్రజలకు చెప్పుకోదగ్గ పనులు ఏమీ చేయలేదని హరీశ్ రావు విమర్శించారు. ఇప్పుడు అకస్మాత్తుగా 99 రోజుల ప్రణాళిక అంటూ కొత్త కార్యక్రమం ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. నిజంగా అభివృద్ధి పనులు చేయాలనే ఉద్దేశం ఉంటే మొదటి రోజునుంచే ప్రణాళికలు అమలు చేయాల్సిందని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇప్పటికీ పూర్తిగా అమలు చేయలేదని హరీశ్ రావు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు కొత్త కార్యక్రమాల పేరుతో ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కొత్త ప్రణాళికలు ప్రకటించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు.

గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను కూడా హరీశ్ రావు ప్రస్తావించారు. ఆ సమయంలో ప్రజల నుంచి లక్షల సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించారని చెప్పారు. కానీ ఇప్పటికీ ఆ దరఖాస్తులలో చాలా వరకు పరిష్కారం కాలేదని ఆయన ఆరోపించారు. చాలా దరఖాస్తులు అధికారుల కార్యాలయాల్లోనే పెండింగ్‌లో ఉండిపోయాయని చెప్పారు. ప్రజలు ఆశతో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా పరిష్కారం కాకుండా ఉండటం బాధాకరమని ఆయన అన్నారు.ఇప్పటికీ పాత దరఖాస్తుల సమస్యలు పరిష్కారం కాలేదని, కానీ ఇప్పుడు మళ్లీ కొత్తగా పది వారాల కార్యక్రమం అంటూ ప్రజలను మరోసారి ఆశ చూపించడం సరైంది కాదని హరీశ్ రావు విమర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉపయోగం ఉండదని, ఇది కేవలం ప్రచారం కోసం మాత్రమే చేస్తున్న కార్యక్రమమని



ఆయన అభిప్రాయపడ్డారు.

రైతుల సమస్యలను కూడా హరీశ్ రావు ప్రస్తావించారు. ఈ సీజన్‌లో కూడా రైతు భరోసా సాయం అందలేదని ఆయన అన్నారు. పంట కోతలు జరుగుతున్న సమయంలో కూడా రైతులకు ప్రభుత్వం నుంచి సరైన సహాయం అందడం లేదని విమర్శించారు. గత సీజన్‌కు సంబంధించిన పంట బోనస్ కూడా ఇవ్వలేదని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. యూరియా ఎరువుల సరఫరా విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. రైతులకు సరైన సమయంలో ఎరువులు అందకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎరువుల కోసం రైతులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలపై దృష్టి పెట్టడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు.

ఉద్యోగాల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని హరీశ్ రావు అన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని చెప్పారు. ఉద్యోగాల క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి చివరకు యువతను నిరాశపరిచారని విమర్శించారు.

# అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి**

సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

**సాంకేతిక లోపాలు సరిదిద్ది, బాధ్యతను నిర్వర్తించాలి..**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు..**

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ, రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు, రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం



చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకు భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

**పార్టీలకు అతీతంగా ప్రజా సేవ..**

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభం

- **మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ (సిడిఎంఎ) డా. టికే శ్రీదేవి**
- **మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్**

**శంకర్‌పల్లి మార్చి 06(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శంకర్‌పల్లి మున్సిపాల్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ (సిడిఎంఎ) డా. టికే శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఉంటుందని పిలుపునిచ్చారు.







ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయం, క్రీడలు, యువత, నైపుణ్యాలు వంటి అంశాలపై విడతల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 6 నుంచి 15వ తేదీ వరకు పరిసరాల శుభ్రత, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పరిష్కారంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామని తెలియజేశారు. రోడ్లపై చెత్త వేయరాదని, తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని, ప్లాస్టిక్ ను నిర్మూలించాలని సూచించారు. పారిశుద్ధ్యం విషయంలో శంకర్‌పల్లి పట్టణం జాతీయ స్థాయిలో అవార్డు పొందాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కే. ఫల్గుణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు దండు రాజేశ్వర్, అశోక్, ఉషాకిరణ్ విజయ్ కుమార్, ఆనంద్ రావు, గణేష్, గిరిజ చంద్రశేఖర్, కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్ కుమార్, డిఈ యాదయ్య, ఏఈ నరేష్, మెప్మా ఆర్పీలు, పారిశుద్ధ, మున్సిపల్, రెవెన్యూ, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల సిబ్బంది ఉన్నారు.

# రేపటి మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయండి

- **2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్**

**గజ్వేల్ మార్చి 06 (ప్రజాస్వరం)**



కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (CPS) అమలు కంటే ముందు (సెప్టెంబర్ 1 2004 కంటే ముందు) నోటిఫికేషన్ వచ్చి, ఆ తర్వాత నియామకమైన డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డీఎస్సీ 2003 గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు కుకునూరి శేఖర్ కోరారు. ఈరోజు సాయంత్రం గజ్వేల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమారు 21సంవత్సరాల క్రితం ఉపాధ్యాయులుగా నియామకమైన DSC 2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ ఇప్పటికీ ఒక కళగానే మారిందని, ఉపాధ్యాయులుగా నియామకమైనప్పటినుండి ప్రభుత్వాలకు ఎన్నో వినతులు, విజ్ఞప్తులు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని, అంతేకాకుండా నోటిఫికేషన్ ఆధారంగా పెన్షన్ ఇవ్వాలని కేంద్రం ఇచ్చిన మెమో 57/4,57/5 ప్రకారం హక్కుగా రావాల్సిన పాత పెన్షన్ అమలు చేయడంలేదని, అదేవిధంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ప్రభుత్వము అమలు చేయకపోవడం కోర్టు ధిక్కరణ అవుతుందని, దీనికి ప్రధాన కారణం సమస్య పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడమేన్నారు , సగం సర్వీస్ పూర్తయ్యే, రిటైర్మెంట్ అవుతున్నా , ఇప్పటి వరకు పాత పెన్షన్ అమలు చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విధంగా ప్రభుత్వాలు చేస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 7వ తేదిన రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ఇందిరా పార్క్ దగ్గర తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పాత పెన్షన్ ఇవ్వాలని కోరుతూ మహా విజ్ఞాపన సభ నిర్వహించడం జరుగుతుందని, దీనికి ప్రతి ఉపాధ్యాయుడు ఒక ఉద్యమకారుడుగా మారి పాత పెన్షన్ పోరాట సాధన లో పాలుపంచుకోవాలన్నారు. ఈ సభకు జిల్లాలోని ,గజ్వేల్ డివిజన్ లోని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు

# బ్రహ్మోత్సవాలకు రావాలని కేసీఆర్‌కు ఆహ్వానం

- **వేద ఆశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం అందజేసిన అర్చకులు**
- **మార్చి 8 నుంచి 19 వరకు నాచారం గుట్టలో వార్షిక బ్రహ్మోత్సవాలు**
- **మాజీ మంత్రి హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి కూడా ఆహ్వానం**

**గజ్వేల్ మార్చి 06 (ప్రజాస్వరం)**



సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మార్చి 8 నుంచి 19 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు హాజరుకావలసిందిగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును దేవస్థానం ప్రతినిధులు ఆహ్వానించారు. అలాగే మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డిని కూడా బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ బి. రంగాచారి, కార్యనిర్వహణ అధికారి పల్లెర్ల రవీందర్, సహాయకులు సుధాకర్, రిటైర్డ్ ఉప ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, పురోహితులు గోపాలకృష్ణ శర్మ, నాగరాజు శర్మలు కలిసి వారికి వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. బ్రహ్మోత్సవాలను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు...

**చిన్న శంకరంపేట మార్చి 6( ప్రజాస్వరం )**

బాదిత కుటుంబానికి బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు చిన్న శంకరంపేట మండల పరిధిలోని జంగరాయ్ గిరిజన తండా కు చెందిన రవి నాయక్ నివాస పూరి గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి బా దిత కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని సూచించడంతో స్థానిక బిఆర్ఎస్ నాయకులు బాదిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు, ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, బాగా రెడ్డి, రమేష్ నాయక్, మోతీరాం, భూపాల్ రెడ్డి, కాట్రోత్ శ్రీనివాస్, బందెల సుధాకర్, కాట్రోతు చందర్, తదితరులు పాల్గొన్నారు






# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ.. మాజీ ఎమ్మెల్యే

**తూప్రాన్ మార్చ్ 6 (ప్రజాస్వరం)**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వార్డ్ సభ్యులు సబితా నాగేష్ స్వప్న నాగరాజు గౌడ్ జోష్ణ రాణి వేణు గజ్వేల్ నియోజకవర్గం లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేస్తున్నట్లు నర్సారెడ్డి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాచారం ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా మాజీ వైస్ చైర్మన్ పెయింటర్ శ్రీనివాస్ దీపక్ రెడ్డి శ్రీశైలం గౌడ్ నర్సింగ్ రావు శ్రీకాంత్ రెడ్డి అనిల్ కుమార్ మహేష్ గౌడ్ జింక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు




# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- **ఎంపీడీవో దామోదర్ తహశీల్దార్ మాలతి**
- **చిన్న శంకరంపేట మండల సర్పంచ్లను సన్మానించిన అధికారులు**

**చిన్న శంకరం పేట మార్చి 5( ప్రజాస్వరం)**



చిన్న శంకరం పేట మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నేటి నుండి జూన్ 12వ తేదీ వరకు 99 రోజులపాటు నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి మండల సర్పంచులతో స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో ఐకెపి కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు, అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులను తహశీల్దార్ మాలతి ఎంపీడీవో దామోదర్ తో పాటు వివిధ శాఖల అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుక అనుమతినిచ్చిన ఇక్కడి అధికారులు ఇసుక తీయనియడం లేదని ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే పేదవారు ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటూ పేదోడి సొంతింటి కల నెరవేర్చుకునేందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకువచ్చి పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తే ఇక్కడి అధికారులు ఇసుక తీయనియడం లేదని జంగారాయి సర్పంచ్ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు, తహసిల్దార్ మాలతి మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం ఇసుక కావాలన్నా మట్టిని తెచ్చుకోవాలన్న మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి అని గతంలో అనుమతులు ఇస్తే ఒక్క రోజును రెండు రోజులుగా పేపర్ పై దిద్ది ఇసుక తరలించడం జరిగిందని అందుకే ఇక్కడ అనుమతులు ఇవ్వడం లేదని ఆమె సూచించారు, చిన్న శంకరంపేట మండలంలో ఇసుక అందుబాటులో లేదని హల్దివాగునుండి ఇసుక తెచ్చుకోవాలంటే కోర్టు నుండి స్టే ఉన్నదని తహశీల్దార్ మాలతి తెలిపారు, పశువైద్యాధికారి డాక్టర్ గీతా మాలిక మాట్లాడుతూ గ్రామాలలో గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు వ్యాక్సిన్ వేసేందుకు వచ్చిన రైతులు స్పందించడం లేదని పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వేయకపోతే పశువులు పాడవుతాయని దానితోపాటు గ్రామం అంతా కూడా ఈ వ్యాధి సోకి పశువులు మొత్తం పాడవుతాయి కాబట్టి రైతులు తప్పకుండా పశువులకు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని ఆమె తెలిపారు, అదే విధంగా గ్రామాలలో కోళ్ల వ్యర్థపదార్థాలను రోడ్లపై వేయడం జరుగుతుందని దీని ద్వారా కుక్కలు గ్రామాలలో గుంపులు గుంపులుగా రావడం జరుగుతుందని చిన్నపిల్లలు ఎవరైనా బయట ఉంటే వారిని కరవడం జరుగుతుందని తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగ ఉంటూ చిన్న పిల్లలను బయట వదిలిపెట్టకూడదని ఆమె తెలిపారు,నెల రోజులపాటు గ్రామాల్లో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని కుక్కల యజమానులు పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె అన్నారు, మండల విద్యుత్ అధికారి దినాకర్ మాట్లాడుతూ వినియోగదారులు ఎవరు కూడా విద్యుత్తు మరమ్మతులు చేసుకోకూడదని ఏవైనా విద్యుత్ సమస్యలు వస్తే అధికారులకు తెలిపాలని ఆయన సూచించారు. వ్యవసాయదారులు తమ పొలాల వద్ద విద్యుత్ సమస్యలు ఉంటే అధికారులకు తెలుపకుండానే సొంతంగా మరమ్మతులు చేసుకోవడం జరుగుతుందని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఎట్టి పరిస్థితిలో విద్యుత్ శాఖ అధికారులకు సమస్యలను తెలిపి మరమ్మతులను విద్యుత్ శాఖ అధికారులతో చేయించుకోవాలని ఆయన తెలిపారు, ఏ సమస్యలు ఉన్న వినియోగదారులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు, ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ ఎన్నికలు జరగక ముందే పార్టీలు అని గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి పై దృష్టి సారించాలని అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు, సర్పంచ్ గా గెలవడం అంటేనే ఒక అదృష్టమని ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కలిగిందని గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాలతి, ఎంపీడీవో దామోదర్, హౌసింగ్ ఏఈ లోకేష్, మిషన్ భగీరథ, ఏఈ స్వప్న, పశువైద్యాధికారి గీతా మాలిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ బుజ్జి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్లు అంజమ్మ, సంధ్య, తో పాటు ఇంటిదగ్గ గ్రామాల సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు


# ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేటలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"

- **ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ**

**సంగారెడ్డి మార్చి 06(ప్రజాస్వరం):**

సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని సదాశివపేట మున్సిపాలిటి చైర్మన్ శ్రీమతి మునిపల్లి అంజమ్మ, వైస్ చైర్మన్ రేణుక 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత, అనిత శజ్జి భాయ్, మున్సిపల్ కమిషనర్ తౌటశివాజి గార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సదాశివపేట మున్సిపాలిటీ కమిషనర్ శివాజి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి విద్యార్థి, విద్యార్థిని చురుకుగా పాల్గొనాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, కళాశాల ప్రాంగణాన్ని అందంగా మరియు పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం కళాశాలలో మార్చి 6 నుండి మార్చి 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రోజు శానిటేషన్ కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ కార్యకలాపాలు, విభాగాల శుభ్రపరిచే కార్యక్రమాలు, ఫైల్స్ వెరిఫికేషన్, బీరువాలు శుభ్రపరచడం, కార్యాలయాల్లో ఫైల్స్‌ను సక్రమంగా అమర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు పులిమామిడి మమత, శజ్జి భాయ్, అనిత విష్ణువర్ధన్ రెడ్డి , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులతో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేయించారు. పురపాలక సంఘాలతో కలిసి మొత్తం 99 రోజుల ప్రణాళికతో ఈ కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్ధులు, డాక్టర్ మురళీకృష్ణతో పాటు బోధన ంమరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.





# కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు..మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్

**నార్సింగి, మార్చ్ 08 ( ప్రజా స్వరం )**

రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ మర్చిపోయిందని తెరాస పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాజీ మంత్రి మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు, హైదరాబాదు నుండి నిజామాబాద్ వెళ్తున్న మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను నార్సింగ్ మండల బిజెపి నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు అనంతరం నార్సింగి మండల కేంద్రంలో బిజెపి కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు, యి సందర్భంగా ఆయనమాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన అన్నారు ప్రజాస్వరంలో ప్రజలు బిజెపిని ఆదరించి రాష్ట్రంలో అభివృద్ధి దిశగా 2028 లో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరిచిపోయిందని టిఆర్ఎస్ పార్టీపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు శీర్ణ చంద్రశేఖర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యెన్నం లింగారెడ్డి, పట్టణ అధ్యక్షులు మైలారం నర్సింలు, మాజీ వార్డు సభ్యులు దాయం నరేష్, భాజపా నాయకులు మన్నే యాదగిరి, అంబటి శ్రీనివాస్, నరేష్‌నాయక్, సాయి కుమార్, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# కుప్పకూలిన యుద్ధ విమానం

**మొదటిపేజీ తరువాయి**

స్థావరం నుంచి ఈ యుద్ధవిమానం సాధారణ శిక్షణ ప్రయాణం కోసం బయలుదేరింది. అయితే టేకాఫ్ అయిన కొద్ది సమయానికే విమానంతో సంబంధం తెగిపోయింది. రాడార్ నుంచి కూడా ఆ విమానం అకస్మాత్తుగా అదృశ్యమైంది. దీంతో వెంటనే వైమానిక దళం అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే శోధన చర్యలు ప్రారంభించారు. రాత్రి సమయంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో శోధనలో కొంత ఇబ్బంది ఎదురైంది. చివరకు తెల్లవారుజామున కర్బీ ఆంగ్లాంగ్ ప్రాంతంలోని అడవి ప్రాంతంలో యుద్ధవిమానం శకలాలను గుర్తించారు. అక్కడే ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు.

ఈ యుద్ధవిమానం జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 7 గంటల 42 నిమిషాల సమయంలో చివరిసారిగా విమానంతో కమ్యూనికేషన్ జరిగినట్లు సమాచారం. ఆ తర్వాత విమానంతో సంబంధం పూర్తిగా తెగిపోయింది. ఆ తర్వాత జరిగిన అన్వేషణలో విమానం కూలిపోయినట్లు తేలింది.సుఖోయ్30 ఎంకేఐ భారత వైమానిక దళంలో అత్యంత శక్తివంతమైన యుద్ధవిమానాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. దీన్ని రష్యా సహకారంతో భారత్‌లో తయారు చేసి ఉపయోగిస్తున్నారు. దేశ రక్షణలో ఈ విమానం కీలక పాత్ర పోషిస్తోంది. అలాంటి యుద్ధవిమానం ప్రమాదానికి గురవడం తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ ఘటనపై భారత వైమానిక దళం విచారణ ప్రారంభించింది. ప్రమాదానికి గల కారణాలు ఏమిటన్న విషయాన్ని తెలుసుకోవడానికి ప్రత్యేక బృందాన్ని నియమించారు. సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న దానిపై అధికారులు సమగ్రంగా పరిశీలిస్తున్నారు.ఈ విషాద ఘటనపై పలువురు రాజకీయ నాయకులు మరియు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం సేవ చేస్తున్న ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. యుద్ధవిమానం ప్రమాదంలో ఇద్దరు పైలట్లు మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. దేశం కోసం వారు చేసిన సేవను ఎప్పటికీ మరచిపోలేమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఇదే ఘటనపై ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా స్పందించారు. స్క్వాడ్రన్ లీడర్ అనూజ్ మరియు ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ మరణం దేశానికి పెద్ద నష్టం అని అన్నారు. దేశ సేవలో వారు చేసిన త్యాగం ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు తన సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్ అగ్రనేత మరియు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందించారు. సుఖోయ్ యుద్ధ విమానం ప్రమాదంలో ఇద్దరు వైమానిక దళ పైలట్లు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన వారికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబాలకు తన సానుభూతి తెలియజేశారు. భారత వైమానిక దళం కూడా ఈ ఘటనపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రమాదంలో మరణించిన ఇద్దరు పైలట్లకు ఐఏఎఫ్ సిబ్బంది అంతా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నారని తెలిపింది. దేశ రక్షణలో విధులు నిర్వహిస్తూ వారు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబాలకు పూర్తి మద్దతు అందిస్తామని వైమానిక దళం తెలిపింది.

స్క్వాడ్రన్ లీడర్ అనూజ్ మరియు ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఇద్దరూ వైమానిక దళంలో ప్రతిభావంతమైన పైలట్లుగా గుర్తింపు పొందారు. దేశ రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం జరగడం అందరినీ కలచివేసింది .ఈ ఘటనతో అసోం రాష్ట్రంలో విషాద వాతావరణం నెలకొంది. స్థానిక అధికారులు కూడా సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం అడవులతో నిండిన ప్రాంతం కావడంతో శోధన చర్యలు కాస్త క్లిష్టంగా మారాయి. దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ప్రాణాలు కోల్పోయిన ఈ ఇద్దరు పైలట్లకు దేశవ్యాప్తంగా ప్రజలు నివాళులు అర్పిస్తున్నారు. వారి సేవలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికలపై కూడా అనేక మంది సంతాపం వ్యక్తం చేస్తున్నారు.మొత్తానికి అసోంలో జరిగిన ఈ విమాన ప్రమాదం దేశాన్ని విషాదంలో ముంచేసింది. దేశం కోసం సేవ చేస్తున్న ఇద్దరు ధైర్యవంతులైన పైలట్లను కోల్పోవడం భారత వైమానిక దళానికి పెద్ద నష్టంగా భావిస్తున్నారు. వారి త్యాగం దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు.

# 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

గత కొంతకాలంగా కర్ణాటకలో పిల్లల సోషల్ మీడియా వినియోగంపై చర్చలు కొనసాగుతున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే కూడా ముందుగా వ్యాఖ్యలు చేశారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉందన్న విషయంపై ప్రభుత్వం వివిధ వర్గాలతో చర్చలు జరిపింది.ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పలు విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లతో కూడా సమావేశమయ్యారు. విద్యార్థులు సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించడం వల్ల చదువుపై ప్రభావం పడుతోందా అనే అంశంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యా నిపుణులు కూడా చిన్న వయస్సులో సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించినట్లు సమాచారం.

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండు రావ్ కూడా ఈ అంశంపై తన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు ఎక్కువసేపు సోషల్ మీడియాలో గడపడం వల్ల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన చెప్పారు. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా ఈ అంశంపై గతంలో ప్రభుత్వానికి సూచనలు చేశారు. బీజేపీ నేత మరియు ఎమ్మెల్యే సురేష్ కుమార్ పిల్లలు సోషల్ మీడియా ప్రభావానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కర్ణాటక ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయం అమలులోకి వస్తే దేశంలోనే మొదటిసారి పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించిన రాష్ట్రంగా కర్ణాటక నిలుస్తుంది. ఇప్పటివరకు భారతదేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ విధమైన పూర్తి నిషేధాన్ని అమలు చేయలేదు. అయితే కొన్ని రాష్ట్రాలు ఈ విషయంపై చర్చలు జరిపాయి. ఆంధ్రప్రదేశ్ మరియు గోవా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పిల్లల సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించే అంశంపై ప్రతిపాదనలు పరిశీలించినట్లు సమాచారం. కానీ ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచంలోని కొన్ని దేశాలు కూడా ఇదే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియా ప్రభుత్వం పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిషేధాన్ని ప్రకటించింది. అక్కడ ఇప్పటికే ఈ నిషేధాన్ని అమలు చేయడం ప్రారంభించారు.ఇంకా ఫిన్లాండ్ మరియు బ్రిటన్ దేశాలు కూడా ఈ అంశంపై చర్చలు జరుపుతున్నాయి. పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు సోషల్ మీడియా వినియోగంపై పరిమితులు విధించే ఆలోచన చేస్తున్నాయి. అమెరికాలో కూడా కొన్ని రాష్ట్రాలు తమ స్వంత చట్టాల ద్వారా పిల్లల సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించే చర్యలు తీసుకున్నాయి.

యూరప్‌లోని ఫ్రాన్స్ మరియు స్పెయిన్ దేశాలు కూడా స్కూళ్లలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించాయి. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయా దేశాల ప్రభుత్వాలు పేర్కొన్నాయి.సోషల్ మీడియా వల్ల చిన్నపిల్లలపై అనేక రకాల ప్రభావాలు పడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువసేపు మొబైల్ ఫోన్ వాడటం వల్ల నిద్రలేమి సమస్యలు వస్తున్నాయని వైద్యులు అంటున్నారు. అలాగే మానసిక ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి.




పిల్లలు ఎక్కువ సమయం సోషల్ మీడియాలో గడపడం వల్ల బయట ఆడుకోవడం,కుటుంబంతో గడపడం, చదువుపై దృష్టి పెట్టడం వంటి విషయాలు తగ్గిపోతున్నాయని తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వం ఈ సమస్యను సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ నిర్ణయంపై కొంతమంది నిపుణులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా నిషేధించడం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందా అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. పిల్లలకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం, సోషల్ మీడియాను బాధ్యతగా ఉపయోగించడం నేర్పడం కూడా అవసరమని కొందరు సూచిస్తున్నారు.అయినా కూడా చిన్న వయస్సులో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించడం అవసరమని చాలా మంది విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం పిల్లలు చదువుపై దృష్టి పెట్టేందుకు సహాయపడుతుందని వారు అంటున్నారు.కర్ణాటక ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందో ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. అమలు విధానం ఎలా ఉంటుందన్న దానిపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా మార్గదర్శకాలు విడుదల చేయనుంది. మొత్తానికి పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే తరహా చర్యలు తీసుకుంటాయా అనే విషయంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

# సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

- **అంబర్‌పేట ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుపై ఆలస్యంపై ఆగ్రహం**
- **సమస్యల త్వరగా పరిష్కరించేలా చర్యలకు డిమాండ్**
- **తెలంగాణ అభివృద్ధి రహదారులే కీలకమన్న కేంద్రమంత్రి**
- **జాతీయ రహదారుల నిర్మాణాలపై కేంద్రం దృష్టి**
- **నితిన్ గడ్కరీకి సమస్యను వివరించినట్లు వెల్లడి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ నిర్మాణం ఆలస్యం అవుతున్న అంశంపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ లేఖలో అంబర్‌పేట ఫ్లైఓవర్‌కు సంబంధించిన పలు విషయాలను ఆయన వివరించారు. తెలంగాణ అభివృద్ధిలో జాతీయ రహదారులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో రహదారుల అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇది తెలంగాణ అభివృద్ధిపై కేంద్రానికి ఉన్న ఆసక్తిని చూపుతుందని ఆయన అన్నారు.

2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి గణనీయంగా జరిగిందని కిషన్ రెడ్డి వివరించారు. ఈ కాలంలో సుమారు 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు నిర్మించబడ్డాయని చెప్పారు. అదేవిధంగా మరో 2,500 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణలోని అన్ని జిల్లాలు జాతీయ రహదారులతో అనుసంధానమవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలకు కూడా ఈ రహదారులు కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను చేపట్టిందని కిషన్ రెడ్డి అన్నారు. నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను తగ్గించేందుకు కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని అంబర్‌పేట క్రాస్ రోడ్ వద్ద ఒక భారీ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన గుర్తుచేశారు. జాతీయ రహదారి 163 పై సుమారు 1.5 కిలోమీటర్ల పొడవుతో నాలుగు లైన్ల ఫ్లైఓవర్ నిర్మించారని చెప్పారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.265 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయిన తర్వాత 2025 మే 5న కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీనిని ప్రారంభించినట్లు కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఆ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను కూడా పాల్గొన్నానని చెప్పారు. అలాగే తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

అయితే ఫ్లైఓవర్ ప్రారంభమైనప్పటికీ దాని కింద నిర్మించాల్సిన సర్వీస్ రోడ్ పనులు ఇంకా పూర్తిగా జరగలేదని కిషన్ రెడ్డి అన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తిగా జరగకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని ఆయన వివరించారు. కొందరు వ్యక్తులు భూసేకరణ ప్రక్రియకు అడ్డంకులు సృష్టిస్తున్నారని కూడా ఆయన తెలిపారు.ఈ ఫ్లైఓవర్‌కు సంబంధించిన ప్రాజెక్టు 2018 సంవత్సరంలోనే మంజూరు అయ్యిందని కిషన్ రెడ్డి చెప్పారు. కానీ అప్పటి నుంచి భూసేకరణలో సమస్యలు తలెత్తడంతో పనులు ఆలస్యం అయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల అక్కడి నుంచి ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.

ఫ్లైఓవర్ ఉన్నప్పటికీ సర్వీస్ రోడ్ సరిగా లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య పూర్తిగా తగ్గడం లేదని చెప్పారు. స్థానిక ప్రజలు కూడా ఈ సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. రహదారి వెంట ఉన్న వ్యాపారులు, స్థానిక నివాసితులు కూడా దీనివల్ల అసౌకర్యానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ సమస్య గురించి గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు తెలియజేశానని కిషన్ రెడ్డి చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు కూడా ఈ విషయం వివరించినట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఈ సమస్యను తెలియజేసినట్లు చెప్పారు.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ మంత్రులతో జరిగిన సమావేశాల్లో కూడా ఈ విషయం ప్రస్తావించారని చెప్పారు. అయినప్పటికీ సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని ఆయన అన్నారు.ఈ అంశంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ మరియు ఇతర అధికారులతో కూడా పలుమార్లు చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరించేందుకు తాను ప్రయత్నించినప్పటికీ ఇంకా పనులు పూర్తి కాలేదని చెప్పారు.

భూసేకరణకు సంబంధించిన భూముల యజమానులకు ఇప్పటికే ప్రభుత్వం పరిహారం చెల్లించినట్లు కిషన్ రెడ్డి వివరించారు. సుమారు రూ.2.54 కోట్ల పరిహారం చెల్లించబడిందని ఆయన తెలిపారు. అయినప్పటికీ మధ్యలో కొందరు దళారులు జోక్యం చేసుకోవడం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని ఆయన ఆరోపించారు.ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ మరియు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి సర్వీస్ రోడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన అన్నారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్ నగరానికి ముఖ్యమైన రహదారి అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మార్గం ద్వారా రోజూ వేలాది వాహనాలు ప్రయాణిస్తాయని చెప్పారు. అందువల్ల ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలంటే సర్వీస్ రోడ్ కూడా పూర్తిగా నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ పూర్తయితే ట్రాఫిక్ సమస్య మరింత తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వాహనదారులకు సౌకర్యం కలగడమే కాకుండా ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సహకరించి భూసేకరణ సమస్యను పరిష్కరిస్తే పనులు త్వరగా పూర్తి అవుతాయని ఆయన అన్నారు.మొత్తంగా చూస్తే అంబర్‌పేట ఫ్లైఓవర్ పూర్తిస్థాయిలో ఉపయోగపడాలంటే సర్వీస్ రోడ్ నిర్మాణం చాలా ముఖ్యమని కిషన్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానని ఆయన తెలిపారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన ఈ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈసారి ఆల్ ఇండియా మొదటి ర్యాంక్‌ను రాజస్థాన్‌కు చెందిన యువకుడు అనూజ్ అగ్నిహోత్రి సాధించాడు.

ఈ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు తెలుగు విద్యార్థులు కూడా మంచి ర్యాంకులు సాధించి ప్రతిభ చాటుకున్నారు. ముఖ్యంగా గూడెల్ల సృజన అనే విద్యార్థిని టాప్ 100లో చోటు సంపాదించి తెలుగు రాష్ట్రాల గర్వంగా నిలిచింది.యూపీఎస్సీ విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 2025 సివిల్ సర్వీసెస్ పరీక్షలో మొత్తం 958 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. మొదటి ర్యాంక్‌ను అనూజ్ అగ్నిహోత్రి సాధించగా, రెండో స్థానంలో రాజేశ్వరి సువే నిలిచింది. మూడో ర్యాంక్‌ను ఆకాన్ష్ ధుల్ సాధించాడు. నాలుగో స్థానంలో రాఘవ్ ఝుంఝున్‌వాలా, ఐదో స్థానంలో ఇషాన్ భట్నాగర్ నిలిచారు.

ఇక ఆరో స్థానంలో జిన్నాయ్ అరోరా, ఏడో స్థానంలో ఏఆర్ రజా మొయినుద్దీన్, ఎనిమిదో స్థానంలో పక్షల్ సెక్రెటరీ, తొమ్మిదో స్థానంలో అస్థా జైన్, పదో స్థానంలో ఉజ్వల్ ప్రియాంక్ నిలిచారు. ఇలా దేశవ్యాప్తంగా వేలాది మంది పోటీ పడిన ఈ పరీక్షలో టాప్ 10లో నిలిచిన వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులుగా నిలిచారు.తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థుల్లో గూడెల్ల సృజన అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. ఆమెకు ఆల్ ఇండియా స్థాయిలో 55వ ర్యాంక్ వచ్చింది. దీంతో ఆమె టాప్ 100లో నిలిచిన ఏకైక తెలుగమ్మాయిగా గుర్తింపు పొందింది.

ఇంకా పలువురు తెలుగు విద్యార్థులు కూడా సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించారు. డీఎస్కే ప్రచేత్ 193వ ర్యాంక్ సాధించాడు. వర్షిత్ రెడ్డి 259వ ర్యాంక్ పొందాడు. ఎం పవన్ కుమార్ రెడ్డి 297వ ర్యాంక్ సాధించాడు. పల్లి ప్రమోద్ విష్ణు 640వ ర్యాంక్ పొందగా, వెలిమినేటి విజయ సింహారెడ్డి 682వ ర్యాంక్ సాధించాడు.అదేవిధంగా శ్రవణ్ కుమార్ 768వ ర్యాంక్ పొందాడు. కోరుపోతుల శ్రీధర్ రాజు 806వ ర్యాంక్ సాధించాడు. కట్టా ప్రత్యూష్ 908వ ర్యాంక్ పొందాడు. గోగుల రాజశేఖర్ 920వ ర్యాంక్ సాధించగా, గుగులోతు జితేందర్ నాయక్ 933వ ర్యాంక్ పొందాడు. వీరి విజయంతో తెలుగు రాష్ట్రాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆల్ ఇండియా టాపర్ అనూజ్ అగ్నిహోత్రి రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ జిల్లాకు చెందినవాడు. అతను జోధ్‌పూర్ సమీపంలోని రహతా గ్రామంలో జన్మించాడు. చదువులో ఎప్పటినుంచో మెరుగైన ప్రతిభ చూపిన అనూజ్, జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసించాడు. 2023 సంవత్సరంలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. అనూజ్ అగ్నిహోత్రి సివిల్ సర్వీసెస్ పరీక్షను మొదటిసారి రాసినప్పుడు కూడా విజయాన్ని సాధించాడు. అయితే ఆ సమయంలో అతనికి వచ్చిన ర్యాంక్‌తో ఢిల్లీ మరియు కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనలో గ్రూప్ బి అధికారిగా చేరాడు. అయినప్పటికీ తన లక్ష్యం ఐఏఎస్ కావడమే అని భావించి మళ్లీ ప్రయత్నం చేశాడు. రెండో ప్రయత్నంలోనే దేశంలో మొదటి ర్యాంక్ సాధించి తన కలను నిజం చేసుకున్నాడు.

యూపీఎస్సీ 2025 నోటిఫికేషన్‌లో మొత్తం 1087 ఖాళీలను ప్రకటించింది. అయితే తుది ఫలితాల్లో 958 మందిని మాత్రమే ఎంపిక చేసింది. మిగిలిన కొన్ని పోస్టులకు తగిన అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోవడంతో అవి ఖాళీగానే మిగిలిపోయాయి. ఈ పోస్టుల్లో ఐఏఎస్‌కు 180 ఖాళీలు ఉన్నాయి. ఐఎఫ్ఎస్ పోస్టులు 55 ఉన్నాయి. ఐపీఎస్ పోస్టులు 150 ఉన్నాయి. సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్‌ఎలో 507 పోస్టులు ఉన్నాయి. అలాగే గ్రూప్‌బి సర్వీసుల్లో 195 పోస్టులు ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులను వీటి ప్రకారం వివిధ సేవల్లో నియమిస్తారు.ఎంపికైన అభ్యర్థుల కేటగిరీలను పరిశీలిస్తే జనరల్ కేటగిరీలో 317 మంది ఎంపికయ్యారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 104 మంది ఎంపికయ్యారు. ఓబీసీ కేటగిరీలో 306 మంది ఉన్నారు. ఎస్సీ కేటగిరీలో 158 మంది ఎంపికయ్యారు. ఎస్టీ కేటగిరీలో 73 మంది అభ్యర్థులు ఉన్నారు. మొత్తం మీద అన్ని కేటగిరీల నుంచి 958 మంది అభ్యర్థులు తుది జాబితాలో చోటు సంపాదించారు.

## ఉప్లూర్ అంగన్‌వాడీ కేంద్రాలకు ఎస్బీఐ చౌట్‌పల్లి సీఎస్ఆర్ చేయూత




**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :** కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఎస్బీఐ చౌట్‌పల్లి శాఖ సామాజిక బాధ్యతగా సహకారాన్ని అందించింది. ఎస్బీఐ పాన్ ఇండియా సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ రాష్ట్ర ఎస్సీటీ ఆధ్వర్యంలో చిన్నారి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అవసరమైన అనేక విద్యా మరియు మౌలిక వసతుల ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్ఈడి టీవీలు, రైస్ కుక్కర్లు, వాటర్ ఫిల్టర్లతో పాటు చిన్నపిల్లల భోజనానికి అవసరమైన స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు కప్పులను పంపిణీ చేశారు. పిల్లల విద్యాభ్యాసానికి తోడ్పడేలా పలకలు, పుస్తకాలు మరియు పెన్సిళ్లను అందజేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సేవా కార్యక్రమంలో మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి పాల్గొని తన వంతుగా పిల్లలకు భోజన ప్లేట్లు, వాటర్ బాటిళ్లు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఎస్బీఐ స్టాఫ్ శ్రీకాంత్ అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్ఈడి టీవీలను అందజేస్తూ డిజిటల్ విద్య ద్వారా పిల్లలకు పాఠాలు సులువుగా అర్థమవుతాయని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ఇలా ముందుకు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొని దాతలకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.




## ప్రభుత్వ ఐటీఐల్లో ప్రైవేట్ గా ఐటీఐ పరీక్షలకు అవకాశం

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :** ప్రభుత్వ ఐటీఐల ద్వారా నిర్వహించబడే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ పరీక్షలకు ప్రైవేట్ అభ్యర్థులుగా హాజరయ్యేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమ్మర్ పల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యం.కోటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాంకేతిక విద్యలో ఐటీఐ సర్టిఫికేట్ లేకపోయినా, సంబంధిత ట్రేడ్‌లో నైపుణ్యం కలిగి ఉండి, ఆయా రంగాల్లో స్థిరపడాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం. ఈ పరీక్షకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండటంతో పాటు, అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీమ్, ఎం.ఎస్.ఎం.ఈ. సంస్థలు, గుర్తింపు పొందిన ఫ్యాక్టరీలు లేదా షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద నమోదైన సంస్థల్లో సంబంధిత ట్రేడ్‌లో కనీసం మూడేళ్ల పని అనుభవం కలిగి ఉండాలి. దరఖాస్తు సమర్పించే తేదీ నాటికి అభ్యర్థికి కనీసం 21 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ లేదా వరంగల్ ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ (అప్రెంటిస్) కార్యాలయాల నుండి దరఖాస్తులను పొంది, పూర్తి చేసిన పత్రాలను నిర్ణీత గడువులోగా అదే కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలు లేదా సందేహాల నివృత్తి కోసం సంబంధిత కార్యాలయ అధికారులను నేరుగా సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ సూచించారు.




## బోధన్‌లో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు : ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :** బోధన్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 8వ రోజు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడు ఫహీం ఉద్దీన్ నేతృత్వంలోని బృందం డివిజన్‌లోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరీక్షల నిర్వహణలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని పరీక్షా కేంద్రాల అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని 12 కేంద్రాల్లో మొత్తం 3,035 మంది విద్యార్థులకు గాను, 2,964 మంది హాజరుకాగా, 71 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రవికుమార్ వెల్లడించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు సజావుగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# నిజామాబాద్ జమా మసీద్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :** నిజామాబాద్ నగరంలోని టౌన్ 2 పోలీస్ స్టేషన్ పరిధిలో గల జమా మసీద్‌లో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముఫ్తీ సయీద్ అక్బర్ నిర్వహించిన పవిత్ర దువాలో పాల్గొన్న సీపీ, అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన రంజాన్ మాసం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ రంజాన్ అంటే కేవలం ఉపవాస దీక్షలే కాదని, అది మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని కొనియాడారు. ఉపవాసం మనిషిలో క్రమశిక్షణ, సహనం మరియు పేదల పట్ల కరుణాభావాన్ని పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరియు సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించిన కమిషనర్ ఈ పవిత్ర మాసంలో చాటే దానధర్మాలు, సోదరభావం వంటి విలువలు అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో కలిసి మెలిసి ఉంటూ నిజామాబాద్ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సామాజిక సామరస్య కార్యక్రమంలో టౌన్ సి.ఐ శ్రీనివాస్ రాజ్, టౌన్ 2 ఎస్.ఐ సయ్యద్ ముజాహిద్, మసీద్ కమిటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ మన్నన్, కార్పొరేటర్ అబ్దుల్ అందాన్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ కుద్దుస్ తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.





## సమాజ హితమే మీడియా లక్ష్యం కావాలి : సీపీ పి.సాయిచైతన్య

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాది అత్యంత కీలకమైన పాత్రని, సమాజ హితాన్ని కాంక్షిస్తూ వార్తలను ప్రచురించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. శుక్రవారం నగరంలో డీడీ9 దినపత్రిక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాస్తవాలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా ప్రజల ముందుంచినప్పుడే మీడియాకు పాఠకుల నుంచి ఆదరణ లభిస్తుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగానికి మీడియా సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో, సామాజిక అంశాలపై చైతన్యం తీసుకురావడంలో పత్రికలు కీలక భూమిక పోషించాలని సూచించారు. అనంతరం డీడీ9 యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందిస్తూ.. పత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో ప్రజాస్వరం నిజామాబాద్ ఇంచార్జి ఢాకా దుర్గ ప్రసాద్, బోధన్ డివిజన్ ఇంచార్జి సురేష్, స్వామి పాల్గొన్నారు.




## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సత్కారం

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :** తెలంగాణ బీసీ రాష్ట్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భీంగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామికి శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి, ఆమె చేస్తున్న ప్రజా సేవలను అభినందించారు. బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి మాట్లాడుతూ, చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆమె తీసుకుంటున్న చొరవ పట్టణ ప్రగతికి ఎంతగానో దోహదపడుతోందని పేర్కొన్నారు. ఈ సన్మానం పట్ల చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి కృతజ్ఞతలు తెలుపుతూ... ఈ గౌరవం తనపై బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ప్రజల సహకారంతో భీంగల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పురస్తు లింబాద్రి, పిట్ల బాపూరావు, శేఖర్ లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# రేవంత్ జేజెమ్మ దిగివచ్చినా కాంగ్రెస్ గెలవదు

- **ఇందూరు గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం: ఈటల రాజేందర్**
- **నాతో ఈటల కలిస్తే.. తెలంగాణలో తిరుగుండదు : ఎంపీ అరవింద్**




**నిజామాబాద్ జిల్లా 06 మార్చి(ప్రజాస్వరం):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయింది. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చి అధికారం దక్కించుకున్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచారు. స్వయంగా ఆ రేవంత్‌రెడ్డి జేజెమ్మ దిగివచ్చినా.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో గెలిచిన బీజేపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన సభ శుక్రవారం ఇందూరు వేదికగా జరిగింది. ఎంపీ ధర్మపురి అరవింద్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత నేత డి.శ్రీనివాస్‌తో తనకున్న అనుబంధాన్ని ఈటల గుర్తు చేసుకున్నారు. మేమంతా శీనన్న అని పిలుచుకునే డి.శ్రీనివాస్ గొప్ప మానవతావాది. నేను తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఆయన మంత్రిగా ఉండి నన్ను ఎంతో ప్రోత్సహించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిది. నేను ఆర్థిక మంత్రిగా తొలి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు.. విపక్షంలో ఉన్నా ఆయన నన్ను హుందాగా అభినందించారని కొనియాడారు. ఎన్నికల్లో ధనప్రభావం పెరగడంపై ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బుకు లొంగని గడ్డ ఇందూరు. ఇక్కడ మాయాజాలం సాగదు. కాంట్రాక్టు బిల్లుల కోసం 12 శాతం లంచాలు అడుగుతున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొంది. కేసీఆర్ కంటే లోతుగా కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని ప్రజలు భావిస్తున్నారు. యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి బీజేపీ ఎదగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**సౌమ్యత.. వేగం కలిస్తే విజయం మనదే: ఎంపీ అరవింద్**

ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. ఈటల రాజేందర్‌ను తెలంగాణలో అత్యంత హుందాతనం గల నాయకుడిగా అభివర్ణించారు. ఈటల సౌమ్యత, నా వేగం తోడైతే తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడం ఖాయం. మేయర్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీ ఇందూరు ఆత్మగౌరవాన్ని ఎంఐఎంకు తాకట్టు పెట్టింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన సీట్లలో సగం కూడా గెలవలేని కాంగ్రెస్.. రేపు స్థానిక సంస్థల్లోనూ మట్టికలవడం ఖాయం అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగాధర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ తదితరులు



# బాన్సువాడ నియోజకవర్గంలో పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి







- **బాన్సువాడ నియోజకవర్గంలో పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి**

**బాన్సువాడ, మార్చి 06(ప్రజాస్వరం):**

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో జరిగిన పలు వివాహాలు, గృహప్రవేశాలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.బాన్సువాడ గ్రామీణ మండలం గోపాల్ తండాకు చెందిన గోపాల్ నాయక్ కుమారుడి వివాహ ముందస్తు వేడుకలకు హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. అలాగే చిన్న రాంపూర్ గ్రామానికి చెందిన కుర్మ విఠల్ నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.నసురుల్లాబాద్ మండలం బొప్సాస్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి సహిత శివ పంచాయతన, నవగ్రహ, ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం శ్రీ గాయత్రీ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సుదర్శన దండి కాశీ స్వామీజీ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగింది. అదే గ్రామంలో బంజారా ఆధ్యాత్మిక గురువులు శ్రీ ప్రేమ్ సింగ్ మహారాజ్, శ్రీ బాబు సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డా. శ్రీరామ్ రావు మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని భోగ్ బండార్ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.వర్ని మండల కేంద్రంలోని వీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మైలారం గ్రామానికి చెందిన దార చిన్న సాయిలు యాదవ్ కుమారుడు సాయి కుమార్ యాదవ్ - శృతి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.అలాగే బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్స్‌లో దారం కిషన్ కుమారుడు సంగమేశ్వర్ - అంకిత వివాహం, మీనా గార్డెన్స్‌లో వెంకటరమణ కుమార్తె అఖిల - సాయి కిరణ్ వివాహం, శ్రీ సరస్వతి ఫంక్షన్ హాల్‌లో పట్లోల అనుషమ్మ మనుమడు సతీష్ రెడ్డి - అక్షయ వివాహం, పీఆర్ గార్డెన్స్‌లో వీరాపూర్ గ్రామానికి చెందిన హరీష్ - రుషిత వివాహాలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. బిచ్కుంద మండలం వాజీద్‌నగర్ గ్రామంలోని శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో బోర్లం గ్రామానికి చెందిన మంద సాయిలు ముదిరాజ్ కుమార్తె సహస్ర - విఠల్ వివాహంలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యాలయాల శుభ్రత కార్యక్రమం

**కామారెడ్డి, మర్చి 06(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమం 06 మార్చి 2026 నుండి 12 జూన్ 2026 వరకు మొత్తం 14 వారాలు (99 రోజులు) నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో మార్చి 6 నుండి మార్చి 15 వరకు చేపట్టవలసిన కార్యక్రమాలను సిద్ధం చేసి అన్ని గ్రామ పంచాయతీలలో అమలు చేస్తున్నారు. కార్యక్రమం తొలి రోజు అయిన మార్చి 6న అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు మరియు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిల్వ ఉన్న స్క్రాప్ తొలగించడం, పరిసరాలను శుభ్రపరచడం, పెండింగ్‌లో ఉన్న కొన్ని ఫైళ్లను క్లియర్ చేయడం వంటి పనులు నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా కార్యాలయాల్లో పారదర్శకత, పరిశుభ్రత మరియు పరిపాలనా సామర్థ్యం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు వెల్లడించారు.





## మున్సిపాలిటీలో ఘనంగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ప్రారంభం




- **99 రోజుల పాటు కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమాలు**
- **పారిశుధ్యం, ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యం : చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి**

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :**

మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారం పట్టణ సర్వాంగీణ సుందరీకరణే ధ్యేయంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి ఈ ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించి, రాబోయే 99 రోజుల పాటు పట్టణంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. ఈ 99 రోజుల సుదీర్ఘ ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులోనూ పారిశుధ్యం, ఆరోగ్యం మరియు సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. వర్షాకాలం మరియు ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగు కాలువల పూడికతీత, దోమల నివారణకు ఫాగింగ్, వీధి దీపాల మరమ్మతుల వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ప్రతి గల్లీలోనూ పరిశుభ్రత వెల్లివిరియాలని, ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా చూడటమే ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. కేవలం పారిశుధ్యానికే పరిమితం కాకుండా, అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే అంశాన్ని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని ఆమె స్పష్టం చేశారు. అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం ద్వారా పారిశుధ్య కార్మికులకు తోడ్పడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## డీ.బి తండాలో విద్యార్థులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :**

ధర్పల్లి మండలంలోని డీ.బి తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి అవసరమైన క్రీడా దుస్తులు, టై, బెల్టులు, ఐడి కార్డులు, బూట్లు మరియు పాఠశాల అవసరాల నిమిత్తం మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సంఘం అధ్యక్షులు భూక్యా లింబాద్రి మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధికి సమాజం తరపున ఇలాంటి సహకారం అందించడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడా సామగ్రి మరియు యూనిఫామ్స్ అందించిన దాతలు లలిత గుగులోత్ రమేష్ దంపతులను సంఘం తరపున ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ ధర్పల్లి మండల అధ్యక్షులు గుగ్లోత్ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైత్రి గంగాధర్, సేవాలాల్ సంఘం ఉపాధ్యక్షులు గుగులోత్ సురేష్, ప్రధాన కార్యదర్శి బోడ అరుణ్, క్యాషియర్ బాధవత్ లింబాద్రి, సంఘ సభ్యులు బాధవత్ భూషన్, భూక్య నాగార్జున్, భూక్య సిసిందర్, భూక్య సుమన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన రోజులు - ప్రగతి కార్యక్రమం

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :**

తెలంగాణ ప్రభుత్వ ప్రగతి' కార్యక్రమంలో భాగంగా భీమ్‌గల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెరుగైన రోజులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.నసీబ్ నేతృత్వంలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ఈ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. పిచ్చిమొక్కలను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, క్రమశిక్షణతో కూడిన మెరుగైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రగతి కార్యక్రమాల వల్ల కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడటమే కాకుండా, విద్యార్థుల్లో బాధ్యతాయుత ప్రవర్తన పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మహిళలకు అవకాశాలివ్వండి.. సమాజ అభివృద్ధిని పొందండి




- **రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క**

**నిజామాబాద్ జిల్లా 06మార్చి(ప్రజాస్వరం) :**

మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారానే సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసరి సీతక్క అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిజామాబాద్ విజయ లక్ష్మి గార్డెన్స్‌లో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారత అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరానికిగాను గివ్ టు గైన్ అనే నినాదాన్ని తీసుకుందని, మహిళలకు అవకాశాలు ఇస్తే వారి నుంచి సమాజానికి ఎంతో ప్రతిఫలం లభిస్తుందని పేర్కొన్నారు. తన జీవితాన్ని ఒక ఉదాహరణగా చూపిస్తూ, విద్య మరియు ఆత్మవిశ్వాసం మనిషిని ఏ స్థాయికైనా తీసుకెళ్లగలవని ఆమె అన్నారు. మహిళలు ప్రతి రంగంలోనూ కరుణ, నిబద్ధత, ధైర్యం కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా జీరో వడ్డీకే రుణాలు అందిస్తూ, కోటి మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తోందని మంత్రి వివరించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ మరియు నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ... యువతకు భద్రతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డ్రగ్స్ వంటి దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని, సైబర్ మరియు ట్రాఫిక్ భద్రతపై చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన సురక్ష దీప్ భద్రతా బోర్డులను ఆవిష్కరించారు. ఇవి మహిళల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మేయర్ కె. ఉమారాణి, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కన్వీనర్ డి.సి.పి (అడ్మిన్) జి.బస్వా రెడ్డి, ట్రెజరర్ కె. సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కవితా రెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థినులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/17154, CELL : 8008609999